ఏఐ క్యాపిటల్ హైదరాబాద్

- అద్భుతమైన నాయకత్వం ఉన్నది
- అనుకూల పర్యావరణ వ్యవస్థ
- మంత్రి కేటీఆర్ లాంటి వ్యక్తులను ఎక్కడా చూడలేదు
- ఐఈఎస్ఏ అధ్యక్షుడు, సీఈవో కే కృష్ణమూర్తి
- దేశంలో తెలంగాణ రాష్ట్రం ఒక కాంతి పుంజం
- ఎఫ్‌టీసీసీఐ ఎక్స్‌లెన్స్ అవార్డు కమిటీ చైర్మన్ లుహరుక

సెమీకండక్టర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఫెసిలిటీ సెంటర్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఐఈఎస్ఏ అధ్యక్షుడు కే కృష్ణమూర్తి. చిత్రంలో మంత్రి కేటీఆర్ తదితరులు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 3 (నమస్తే తెలంగాణ): ఆ రంగం, ఈ రంగం అన్న తేడా లేకుండా అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తున్న తెలంగాణకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా పరిశ్రమలను తీసుకొస్తున్న రాష్ట్ర ప్రభుత్వ కృషి, తీసుకొంటున్న చర్యలు, కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై అన్ని వర్గాల నుంచి పొగడ్తలు దక్కుతున్నాయి. ఐటీ, ఫార్మా రంగాల్లో సాటి లేదని నిరూపించుకున్న హైదరాబాద్‌కు మరో కితాబు అందింది. టెక్నాలజీ రంగంలో సరికొత్త విప్లవాన్ని సృష్టిస్తున్న హైదరాబాద్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రాజధానిగా మారిందని ఇండియా ఎలక్ట్రానిక్స్ అండ్ సెమీ కండక్టర్ అసోసియేషన్ (ఐఈఎస్ఏ) అధ్యక్షుడు, సీఈవో కే కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం కోకాపేటలో మైక్రోచిప్ టెక్నాలజీస్ ఇండియా ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఫెసిలిటీ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారకరామారావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో అద్భుతమైన నాయకత్వం ఉన్నదని కొనియాడారు. అత్యంత అనుకూలమైన పర్యావరణ వ్యవస్థను ఇక్కడ సృష్టించారని శ్లాఘించారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్‌కు చెందిన ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలను నిర్వహించడానికి ఐఈఎస్ఏకు హైదరాబాద్‌కు మించిన ప్రాంతం దేశంలో మరెక్కడా లేదని స్పష్టం చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో నిర్వహించే ఐఈఎస్ఏ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోనే పెద్ద ఎత్తున నిర్వహిస్తామని ప్రకటించారు. తాను ఏటా హైదరాబాద్‌లో 3-4సార్లు పర్యటిస్తుంటానని, ఇక్కడ చాలా మార్పులు చోటుచేసుకొన్నాయని వెల్లడించారు. 'ఐటీ రంగం అభివృద్ధిపై ఈ స్థాయిలో దృష్టి సారించిన మంత్రి కేటీఆర్, ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్ లాంటి వారిని దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా చూడలేదు. ఇక్కడి మార్పుల్లో ప్రధానంగా చెప్పుకోదగ్గవి.. మౌలిక వసతుల కల్పన, అంతర్జాతీయ కంపెనీలు. రాష్ట్ర ప్రభుత్వ చొరవ భేష్. ఇవన్నీ రాష్ట్రాన్ని ఎంతో ముందుకు తీసుకువెళ్తున్నాయి' అని తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధిని చూసి చాలా మంది అభినందిస్తున్నారని పేర్కొన్నారు.

ఐటీ, ఫార్మా ఎగుమతుల్లో తెలంగాణ లీడర్: లుహరుక

దేశంలోని అన్ని రాష్ట్రాల్లో తెలంగాణ ఒక కాంతి పుంజం అని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ) ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ కమిటీ చైర్మన్ సీఏ అరుణ్ లుహరుక కొనియాడారు. సోమవారం హెచ్ఐసీసీలో ఎఫ్‌టీసీసీఐ ఎక్స్‌లెన్స్ అవార్డుల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ తలసరి ఆదాయం రూ.3.17 లక్షలుగా ఉన్నదని, ఇది దేశ సగటు రూ.1.46 లక్షలు కన్నా చాలా ఎక్కువ అని అన్నారు. ఇదొక్కటే కాదు.. ఇలాంటి ప్రమాణాలు వందల్లో ఉన్నాయని వెల్లడించారు. మౌలిక సదుపాయాల కల్పనతో అమెజాన్, మైక్రోసాఫ్ట్ వంటి అంతర్జాతీయ సంస్థలు తెలంగాణకు తరలివస్తున్నాయని వివరించారు. ఐటీ, ఫార్మా ఎగుమతుల్లో దేశంలో తెలంగాణ ప్రస్తుతంగా లీడర్‌గా ఉన్నదని తెలిపారు. అటు.. రాష్ట్రాల పనితీరును గుర్తించటంలో కేంద్ర విభాగాలు విఫలం అవుతున్నాయని విమర్శించారు. రాష్ట్రాలు దేశంలో భాగం కాదా? అని ఆయన ప్రశ్నించారు.

దేశ టెకీల్లో సగం మనోళ్లే

- 100కు 40 మంది తెలంగాణ నుంచే
- ఐటీ రంగంలో గణనీయ వృద్ధిరేటు
- లైఫ్ సైన్సెస్ రంగంలో నంబర్ వన్
- ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్
- మైక్రో చిప్ రిసెర్చ్ సెంటర్ ప్రారంభం

మైక్రోచిప్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ అండ్ రిసెర్చ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 3 (నమస్తే తెలంగాణ): టెక్నాలజీ రంగంలో తెలంగాణ అద్భుత ప్రగతి సాధిస్తున్నదని, గత రెండేండ్లలో దేశంలో వచ్చిన టెక్ ఉద్యోగాల్లో 44 శాతం హైదరాబాద్ నుంచే వచ్చాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారకరామారావు తెలిపారు. ప్రతి ఇద్దరు టెకీల్లో ఒకరు తెలంగాణ నుంచే ఉన్నారని వెల్లడించారు. మైక్రోచిప్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ అండ్ రిసెర్చ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. 9 ఏండ్లలో తెలంగాణ ఐటీ రంగంలో గణనీయ వృద్ధిరేటును నమోదు చేసిందని వివరించారు. 'ఉద్యోగావకాశాలు 3 రెట్లు పెరిగితే, ఐటీ ఎగుమతులు 4 రెట్లు పెరిగాయి. 2014లో ఐటీ ఉద్యోగాలు 3,23,396 ఉంటే, 2023 నాటికి 9,05,715 ఉద్యోగాలు వచ్చాయి. ఐటీ ఎగుమతులు 2014లో రూ.57,258 కోట్లు ఉంటే, 2023 నాటికి రూ.2,41,275 కోట్లుగా ఉన్నాయి. ఈ ఒక్క రంగమే కాదు లైఫ్ సైన్సెస్, ఆటోమొబైల్, మెడికల్ డివైజెస్ రంగాల్లోనూ హైదరాబాద్ దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నది. లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా ఉన్నది' అని వెల్లడించారు. దేశంలోని మొత్తం ఫార్మాసూటికల్స్ ఉత్పత్తిలో 40 శాతం హైదరాబాద్ నుంచే ఉత్పత్తి అవుతున్నదని, మూడో వంతు గ్లోబల్ వ్యాక్సిన్స్ ఇక్కడి నుంచే ఉత్పత్తి అవుతున్నాయని వివరించారు. వచ్చే ఏడాది నుంచి 50 శాతం వ్యాక్సిన్లు హైదరాబాద్ నుంచే తయారవుతాయని, అవి సుమారు 14 బిలియన్ డోసులుగా ఉంటాయని తెలిపారు.

దేశంలోనే అతి పెద్ద మెడికల్ డివైజెస్ పార్కు

దేశంలోనే అతి పెద్ద మెడికల్ డివైజెస్ పార్కు ఇక్కడే ఉన్నదని, ఇక్కడి కంపెనీలతో కలిసి పనిచేసేందుకు ఎలక్ట్రానిక్స్ రంగంలోని కంపెనీలకు మంచి అవకాశం ఉన్నదని మంత్రి కేటీఆర్ వెల్లడించారు. ఆటోమొబైల్ రంగం అభివృద్ధి కోసం తెలంగాణ మొబిలిటీ వ్యాలీని ఏర్పాటు చేసినట్టు వివరించారు. 'దేశంలోనే తొలిసారిగా ఈ తరహా కేంద్రాన్ని రాష్ట్రంలో ప్రారంభించాం. ఇందులో కంపెనీలను ఏర్పాటు చేసేందుకు పలువురు ఆసక్తి చూపారు. ఈ జాబితాలో ఇంటెల్, బాష్, జెడ్ ఎఫ్, క్వాల్‌కామ్, స్టెలాంటిస్ వంటి కంపెనీలు ఉన్నాయి. తెలంగాణ మొబిలిటీ వ్యాలీకి నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా మైక్రోచిప్ టెక్నాలజీస్ వ్యవహరించాలి' అని సూచించారు. ఇక్కడి నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీలకు నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించేందుకు ప్రభుత్వ రంగ సంస్థగా తెలంగాణ అకాడమీ అండ్ స్కిల్, నాలెడ్జ్ (టాస్క్) సెంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు.

25 ఏండ్లుగా దేశంలో మైక్రోచిప్ కార్యకలాపాలు

దేశంలో మైక్రోచిప్ కార్యకలాపాలు 25 ఏండ్లుగా విజయవంతంగా కొనసాగిస్తున్నామని, మరింతగా విస్తరించేందుకు కొత్త కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని మైక్రోచిప్ ప్రెసిడెంట్, సీఈవో గణేశ్‌మూర్తి తెలిపారు. కోకాపేటలో గోల్డెన్ మైల్ ఆఫీస్ టవర్‌లో 1,68,000 చదరపు అడుగుల్లో ఆర్‌అండ్‌డీ సెంటర్‌ను 5 అంతస్థుల్లో ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఈ సెంటర్ దేశంలోని అగ్రశేణి వ్యాపార కారిడార్లలో ఉండటంతో గ్లోబల్ మైక్రోచిప్ వ్యాపార అవసరాలకు, ఈ ప్రాంతంలో పెరుగుతున్న తమ కస్టమర్ బేస్‌కు మద్దతుగా నిలుస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, ఐఈఎస్ఏ అధ్యక్షుడు కే కృష్ణమూర్తి, మైక్రో చిప్ ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్ వైస్‌ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణ టీ-ఫేస్

'తెలంగాణ ప్రభుత్వం కొత్తగా టీ-ఫేస్ (తెలంగాణ ఫ్యాబ్‌లెస్ యాక్సిలరేటర్ త్రూ క్లౌడ్ ఎనేబుల్‌మెంట్)ను ఆవిష్కరించింది. దీని ద్వారా వీఎల్ఎస్ఐ (వెరీ లార్జ్ స్కేల్ ఇంటిగ్రేషన్)కి సంబంధించిన కార్యకలాపాలు నిర్వహించేందుకు దోహదం చేస్తుంది. ఫ్యాబ్‌లెస్ చిప్ డిజైనింగ్‌లో స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడానికి వర్చువల్ ఇంక్యుబేషన్ ప్లాట్‌ఫామ్‌గా ఉంటుంది. హైదరాబాద్ ఇప్పటికే అతి పెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్‌గా ప్రసిద్ధి చెందింది. టీ హబ్, టీవర్క్స్‌లను ఏర్పాటు చేసి సరికొత్త ఆవిష్కరణలు వచ్చేలా స్టార్టప్‌లకు ప్రోత్సహిస్తున్నాం. సెమీకండక్టర్ రంగంలో మనం ప్రారంభ దశలో ఉన్నాం. ఇందు కోసమే ప్రభుత్వం టీ-ఫేస్‌ను తీసుకువచ్చింది. ఇందులో హైదరాబాద్ కీలక పాత్ర పోషించేలా కృషి చేస్తున్నాం' కేటీఆర్ అని వెల్లడించారు.

ఎర్రబెల్లికి బర్త్‌డే విషెస్ చెప్పిన కేటీఆర్

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్ సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి ఎర్రబెల్లి మంగళవారం జన్మదినం జరుపుకోనున్నారు. ఆయన ఆమెరికా పర్యటనకు వెళ్తున్నందున ముందస్తుగా దయాకర్‌రావుకు శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘ కాలం ప్రజాసేవలో ఉండాలని కేటీఆర్ ఆకాంక్షించారు. సన్మానించిన వారిలో మంత్రులు మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. అర్చకోద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డీవీఆర్ శర్మ ఆధ్వర్యంలో ప్రముఖ ఆలయాల వేదపండితులు పలువురు పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి శేష వస్త్రం, గజమాలతో మంత్రి దయాకర్‌రావును సత్కరించారు. ఆశీర్వచనం ఇచ్చి, తీర్థప్రసాదాలు అందజేశారు. పాలకుర్తి క్షేత్ర అభివృద్ధికి మంత్రి ఎర్రబెల్లి ఎల్లవేళలా సహకరిస్తున్నారంటూ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

ఇప్పుడు ట్రిపుల్ ఇంజిన్ కాలం

- వ్యంగ్యంగా ట్వీట్ చేసిన కేటీఆర్

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): ప్రస్తుతం ట్రిపుల్ ఇంజిన్ కాలం నడుస్తున్నదని, డబుల్ ఇంజిన్ అవుట్ డేటెడ్‌గా మారిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. మహారాష్ట్రలో జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో సోమవారం మంత్రి కేటీఆర్ వ్యంగ్యంగా ట్వీట్ చేశారు. ఎన్సీపీ ఎమ్మెల్యేలను బీజేపీ చీల్చింది. ఆ ఎమ్మెల్యేలు.. బీజేపీ, శివసేన (షిండే) వర్గంతో కొనసాగుతున్న రాష్ట్ర ప్రభుత్వంలో చేరిన విషయం తెలిసిందే.

పోడు పట్టాల్లో వేగం పెంచాలి

- ఎరువుల నిల్వలపై సమీక్షించండి
- రైస్ మిల్లుల్లో తనిఖీలు చేపట్టండి
- కలెక్టర్లకు సీఎస్ ఆదేశం

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): ప్రస్తుత వానకాల సీజన్‌లో లబ్ధిదారులకు రైతుబంధు పథకం కింద ఆర్థిక సాయం అందించాల్సి ఉండడంతో రాష్ట్రవ్యాప్తంగా పోడు పట్టాల పంపిణీ వేగవంతం చేసి వారంలోగా ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. పోడు రైతుల బ్యాంకు ఖాతాల వివరాలను రైతుబంధు పోర్టల్‌లో నమోదు చేయాలని, రెవెన్యూ, పోలీసు, అటవీశాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సోమవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోడు భూముల పట్టాల పంపిణీ పురోగతిని ఆమె సమీక్షించారు. గృహలక్ష్మి పథకం, ఎరువులు, విత్తనాల నిల్వలు, తెలంగాణకు హరిత హారం, బీసీ చేతివృత్తుల వారికి ఆర్థిక సాయం, గొర్రెల పంపిణీ పథకం, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం తదితర అంశాల పైనా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎరువులు, విత్తనాల నిల్వలపై కలెక్టర్లు రోజూ పర్యవేక్షించాలని, జిల్లాలో సరిపడా నిల్వలను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహించి స్టాక్ పొజిషన్ సరిచూసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. బీసీ చేతివృత్తిదారులకు ఆర్థిక సాయం కింద అందిన దరఖాస్తులన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్ సిన్హా, బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బీ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.


దక్షిణకొరియా రాజధాని సియోల్‌లోని వార్ మెమోరియల్ పార్క్ వద్ద మంత్రులు గంగుల, శ్రీనివాస్‌గౌడ్, ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ వినోద్‌కుమార్

రాష్ట్రంలో అతిపెద్ద వార్ మెమోరియల్

- ఏర్పాటు చేయనున్నట్టు మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, గంగుల వెల్లడి

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): దేశంలోనే అతిపెద్ద వార్ మెమోరియల్ రాష్ట్రంలో ఏర్పాటు కానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ వినోద్ కుమార్, టూరిజం మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. కొరియన్ యుద్ధంలో దక్షిణ కొరియా త్రివిధ దళాలు ఉపయోగించిన యుద్ధ విమానాలు, ట్యాంకర్లు, జలాంతర్గాములు, ఇతర యుద్ధ సామగ్రితో రాజధాని సియోల్‌లో ఏర్పాటు చేసిన వార్ మెమోరియల్ పార్క్‌ను మంత్రులు సోమవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. యువతలో దేశభక్తిని పెంపొందించేందుకు దక్షిణ కొరియా తరహాలో సాయుధ దళాల సహకారంతో అతిపెద్ద వార్ మెమోరియల్‌ను ఏర్పాటు చేయాలని కేసీఆర్ యోచిస్తున్నారని, అందులో భాగంగానే దక్షిణ కొరియాలోని పర్యాటక ప్రదేశాలను అధ్యయనం చేస్తున్నట్టు తెలిపారు. పర్యాటక శాఖ ఎండీ మనోహర్, కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

ఉమ్మడి పాలనకన్నా ఇప్పుడే బాగుంది

మూడోపేజీ తరువాయి...

అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సీఎం కేసీఆర్ గొప్ప ఆలోచనకు నిదర్శనమని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ కమిషనర్‌గా తాను ఉమ్మడి రాష్ట్రంలో పని చేశానని, అప్పటికి ఇప్పటికి చాలా తేడా ఉన్నదని పేర్కొన్నారు. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుతో ఇక్కడ చాలా అభివృద్ధి జరిగిందని, విగ్రహం ఏర్పాటుచేసిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

లింబాద్రికి అభినందనలు

ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా నియమితులైన ప్రొఫెసర్ ఆర్ లింబాద్రిని ఏపీ మంత్రి మెరుగు నాగార్జున అభినందించారు. మాసబ్ ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయానికి వచ్చిన మంత్రి.. లింబాద్రికి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏపీ మంత్రి నాగార్జున. చిత్రంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి, ఘంటా చక్రపాణి తదితరులు

ఆరో రోజు రైతుబంధు 226.23 కోట్లు

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): రైతుబంధు పంపిణీ ఎలాంటి ఇబ్బంది లేకుండా సాఫీగా కొనసాగుతున్నది. ఆరో రోజైన సోమవారం సుమారు లక్ష మంది రైతులకు రూ.226.23 కోట్లను ప్రభుత్వం పంపిణీ చేసింది. దీంతో ఇప్పటి వరకు ఐదెకరాల వరకు గల రైతులకు 95.98 లక్షల ఎకరాలకు 59.38 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.4,798.86 కోట్లు జమ చేసింది.

మోదీ రాకకు ముందే ముసలం

- బీజేపీలో పదవుల చిచ్చు
- అధ్యక్ష పదవి చుట్టూ రాజకీయం
- పాత, కొత్త నేతలుగా చీలిన బీజేపీ

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలంగాణ పర్యటనకు ముందే బీజేపీలో ముసలం పుట్టింది. తమకు పదవులు కావాలంటూ నేతలంతా ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర బీజేపీ రాజకీయం మొత్తం అధ్యక్ష పదవి చుట్టూ తిరుగుతున్నది. కొత్తగా వచ్చే వారికేనా పదవులు? మా సంగతేంటి? అని ఏండ్ల తరబడి పార్టీని అంటిపెట్టుకుని ఉన్న నేతలు ప్రశ్నిస్తున్నారు. దీంతో రాష్ట్ర బీజేపీ ఇప్పుడు కొత్త, పాత నేతలగా విడిపోయింది.

అభ్యర్థన కాదు.. అల్టిమేటమే

తమకేం పదవి కావాలో ముందే ఓ నిర్ణయానికి వస్తున్న నేతలు ఢిల్లీ వెళ్లి తమకు అది ఇస్తేనే ఉంటామని, లేదంటే తమ దారి తాము చూసుకుంటామంటూ అల్టిమేటం జారీ చేస్తుండడం చూసి అధినాయకత్వమే విస్తుపోతున్నది. పార్టీపై పట్టుకోసం ప్రయత్నిస్తున్న కొత్త నేతలు.. అధ్యక్ష పదవికి బండి సంజయ్ అసమర్థుడని, తమకు అప్పగిస్తే పార్టీని పరుగులు పెట్టిస్తామని అధిష్ఠానం వద్ద గప్పాలు కొడుతున్నారు. మరోవైపు, తనకు అధ్యక్ష పదవి కానీ, ప్రచార కమిటీ బాధ్యతలు కానీ అప్పగిస్తేనే ఉంటానని, లేదంటే లేదని ఈటల రాజేందర్ తెగేసి చెప్పినట్టు తెలుస్తున్నది. రఘునందనరావు కూడా పదవిని ఆశిస్తున్నట్టు ఆయన తాజా వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. ఈ వరుస పరిణామాలతో పార్టీలో బండి సంజయ్ ఒంటరిగా మారారు. తాజా పరిణామాలతో తీవ్ర అసంతృప్తికి గురవుతున్న సీనియర్ నాయకులు కొత్త నేతలతో పార్టీకి ముప్పేనని హెచ్చరిస్తున్నారు. మోదీ రాకకు ముందే నేతలు ఇలా పదవుల కోసం వెంపర్లాడుతుండడం చూసి ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

మొహర్రం వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

- మంత్రులు కొప్పుల, మహమూద్ అలీ

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): మొహర్రం పండుగ నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను సాంఘిక, మైనార్టీ సంక్షేమశాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్, హోంమంత్రి మహమూద్ అలీ ఆదేశించారు. మొహర్రం వేడుకల నిర్వహణకు అన్ని శాఖల అధికారులతో మాసాబ్ ట్యాంక్‌లోని డీఎస్ఎస్ భవన్‌లో మంత్రులు సోమవారం సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే అహ్మద్ బాషా ఖాద్రీ, మైనార్టీ శాఖ సలహాదారు ఏకే ఖాన్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ మహమ్మద్ సలీం తదితరులు పాల్గొన్నారు.

పఠనోత్సవానికి ఇస్రో శాస్త్రవేత్తల ఫిదా

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ) : విద్యార్థులు ధారాళంగా చదవడం. పఠన నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు విద్యాశాఖ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పఠనోత్సవానికి భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తల బృందం ఫిదా అయ్యింది. విద్యార్థులు ఆనర్గళంగా చదవడాన్ని పరిశీలించిన బృందం ప్రశంసలు కురిపించింది. ఇస్రో అనుబంధ విభాగం అడ్వాన్స్‌డ్ డాటా ప్రాసెసింగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సీనియర్ శాస్త్రవేత్త ప్రశాంత్ అంగారక్‌లతో కూడిన ప్రతినిధి బృందం సోమవారం హైదరాబాద్ జిల్లా తిరుమలగిరిలోని ప్రభుత్వ బడిని సందర్శించింది. పాఠశాలలో రీడింగ్ క్యాంపెయిన్ గురించి ప్రతినిధి బృందం ఆరా తీసింది. పఠన నైపుణ్యాలను పెంపొందించేందుకు జూన్ 26 నుంచి పఠనోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టుగా టీచర్లు ఆ బృందానికి వివరించారు. 'ఒక చేతితో కాకుండా రెండు చేతులతో పుస్తకాలను చదవాలని.. మనం పుస్తకాన్ని గౌరవిస్తే పుస్తకం మనల్ని గౌరవిస్తుందని ఈ వారు విద్యార్థులకు సందేశం ఇచ్చారు.

కేంద్రానికి తొందరెందుకు?

- ఏఐఎస్ అధికారుల కేటాయింపుపై హైకోర్టులో అదనపు ఏజీ ప్రశ్న

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ, ఏపీకి ఆలిండియా సర్వీస్ (ఏఐఎస్) క్యాడర్ అధికారుల కేటాయింపు వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వానికి తొందర ఎందుకని అడ్వకేట్ జనరల్ జే రామచందర్రావు ప్రశ్నించారు. ఈ కేటాయింపులకు సంబంధించి గతంలో సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్) ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీళ్లు సోమవారం హైకోర్టులో విచారణకు రావడంతో వాటిపై రాష్ట్ర ప్రభుత్వ వాదనలు వినాలని రామచందర్రావు కోరారు. దీంతో కేంద్రం తరపున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్ జోక్యం చేసుకున్నారు. ఏఐఎస్ అధికారుల విభజన కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అంశమని, దానితో తమకు సంబంధం లేదని రాష్ట్ర ప్రభుత్వం గతంలో క్యాట్‌కు చెప్పిందని, ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని అన్నారు. దీనిపై రామచందర్‌రావు స్పందిస్తూ.. విద్యుత్తు బకాయిలు, ఉమ్మడి ఆస్తుల పంపకాలు సహా ఏపీ పునర్విభజనకు సంబంధించిన అనేక వివాదాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. ఏఐఎస్ అధికారుల కేటాయింపుల వ్యవహారంపై కేంద్రానికి తొందర ఎందుకని ప్రశ్నించారు. దీంతో ఇరుపక్షాలు సమయనం పాటించాలని, రాజకీయాలకు హైకోర్టును వేదికగా వాడుకోవద్దని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. ఈ అంశంపై తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది.

దత్తత వెళ్తే ఆస్తిపై హక్కు ఉండదు

- జన్మించిన కుటుంబంలో ఏమీ కోరవద్దు
- హైకోర్టు ఫుల్ బెంచ్ చారిత్రక తీర్పు

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): ఒక వ్యక్తి వేరే కుటుంబానికి దత్తత వెళ్తే.. పుట్టిన కుటుంబ ఆస్తులపై ఆ వ్యక్తికి హక్కులు ఉండవని హైకోర్టు స్పష్టం చేసింది. దత్తత వెళ్లిన కుటుంబంలో మాత్రమే ఆ వ్యక్తికి హక్కులు ఉంటాయని పేర్కొన్నది. తాను దత్తత వెళ్లినప్పటికీ జన్మించిన కుటుంబ ఆస్తిలోనూ తనకు వాటా వస్తుందని ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలానికి చెందిన ఏపీఎల్ఆర్ నర్సింహారావు చేసిన వాదనను కింది కోర్టు సమర్థించడంతో ఆయన సోదరుడు ఏ నాగేశ్వరరావు హైకోర్టులో సవాల్ చేశారు. ఈ అప్పీల్‌ను ఆమోదిస్తూ జస్టిస్ పీ నవీన్‌రావు, జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ నగేశ్ భీమపాకతో కూడిన విస్తృత ధర్మాసనం (ఫుల్ బెంచ్) 44 పేజీల చారిత్రక తీర్పును వెలువరించింది. ఒక వ్యక్తి రెండు కుటుంబాల్లో సభ్యుడిగా ఉండేందుకు వీల్లేదని, మైనేస్ హిందూ చట్టం లేదా ముల్లా సూత్రాలపై ఆధారపడిన హిందూ చట్టాల ప్రకారం దత్తత చేసినట్టయితే జన్మించిన కుటుంబంతో సంబంధాలన్నీ తెగిపోతాయని ఆ తీర్పులో పేర్కొన్నది. దత్తత చట్టంలోని సెక్షన్ 12(బీ) ప్రకారం.. దత్తత వెళ్లినవారికి ముందే ఆస్తులున్నా, లేక అప్పటికే జన్మించిన కుటుంబంవారు ఆస్తులు రాసిచ్చినా వాటిపై ఆ వ్యక్తులకు (దత్తత వెళ్లినవారికి) హక్కులు ఉంటాయని స్పష్టం చేసింది.

ఉపాధ్యాయ బదిలీలపై స్టే పొడ